# నైజం

ఆదేశం చిన్న దేశమే అయినా, అతి సంపన్న దేశం. అందుకే పొరుగుదేశం హఠాత్తుగా ఆ దేశంపైన దండెత్తింది. అప్పటివరకూ ప్రశాంతతకు నిలయమైన ఆ దేశంపై యుద్ధపు కారుమేఘాలు కమ్ముకున్నాయి. జన జీవనం అస్తావ్యస్త్యమయ్యింది. తమ ప్రాణాల్ని గుప్పిట్లో పెట్టుకుని, వున్నపాటున తమ స్వదేశాలకు బయల్దేరారు. బ్యాంకుల్లోంచి డబ్బు తీసుకుందుకూ్కడా వాళ్ళకి వ్యవధి లేకపోయింది. దగ్గరున్న పైకంతో, యేవో కొన్ని విలువైన సామాన్లతో బయల్దేరారు. అలా బయల్దేరిన వారిలో, వేణుగోపాల్ ఒకడు!

అక్కడి యుద్ధం గురించి, ప్రజల్లో చెలరేగిన భయభ్రాంతుల గురించి, ఇతర దేశస్థులు, తమ స్వంత దేశాలకు వెళ్ళిపోతున్న వైనం గురించి, యెప్పటికప్పుడు 'రేడియో, టి.వి.' వార్తల ద్వారా కొంతమేరకు తెలుస్తూనే వున్నాయి. ఆ రోజు నుంచీ వేణుగోపాల్ భార్య, పిల్లలు,

బంధువులు, అతని క్షేమ సమాచారాలు తెలీక, అంతులేని ఆందోళనకి గురయ్యారు. ఉత్తరాలు బట్వాడా జరగడం లేదు. ఎక్కడికి, యెవరికి ఫోను చెయ్యాలో తెలీని అయోమయ స్థితిలో పడింది, వేణుగోపాల్ భార్య వసంత.

అటువంటి పరిస్థితిలో ఓ టెలిగ్రామ్ వచ్చింది వసంత పేర. ఆ టెలిగ్రామ్ విప్పి చదవకుండానే, అక్కడున్న వాళ్ళందర్లోనూ భయం ఆవరించింది. ఆ టెలిగ్రామ్ యెటువంటి వార్తని మోసుకొస్తుందోనన్న భయం, అందర్నీ వివశుల్ని చేసింది. ఆ టెన్షన్ని యింక భరించలేక వసంత పెద్దకొడుకు టెలిగ్రామ్ చదివాడు. అతని మొహం, ఆనందంతో విప్పారడం చూసి ప్రశ్నించింది వసంత.

"ఎక్కణ్ణించిరా?" అని.

"నాన్న దగ్గర్నించి...."

"ఆ...." అందరూ ఒక్కసారి ఆసక్తితో ముందుకు వంగారు.

"క్షేమంగా వున్నారు కదా, అంతే చాలు...." అంది వసంత.

"అంతే కాదమ్మా, ఆదివారంనాడు ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్‌కి వస్తున్నట్టు యీ టెలిగ్రామ్‌లో తెలియజేశారు" అన్నాడా అబ్బాయి.

"అలాగా!" మురిసిపోతూ అంది వసంత.

అక్కడున్న వాళ్ళందరి మొహాలూ విప్పారినై. వసంతకీ, పిల్లలకీ అదో మధురక్షణం!

* * *

వేణుగోపాల్ వస్తోన్న ఆదివారం, రానే వచ్చింది. ఆ రోజు వుదయం ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. వసంత, పిల్లలు, ఒక పక్క ఆనందంతోనూ, మరోపక్క వుత్కంఠతోనూ, వుక్కిరి బిక్కిరవుతున్నారు. బండి వచ్చే వేళకి ఓ పావు గంట ముందే రైల్వే స్టేషను చేరుకున్నారు. వాళ్ళ ఆరాటం, అటువంటిది.

రైలు, నిండు గర్భిణిలా ఆయాసంతో వచ్చి ఆగింది ప్లాట్‌ఫారం ఒకటిలో. వేణుగోపాల్, కుటుంబ సభ్యుల్ని చూసి, సంతోషం పట్టలేక, చిన్న పిల్లాడిలా అరిచాడు. చేతిలో ఓ సూట్‌కేసు, భుజానికి ఓ బేగ్‌తో దిగాడు. పరుగు, నడకల్తో కుటుంబ సభ్యులున్న చోటుకి చేరుకున్నాడు.

అతని ఆనందానికి హద్దులు లేకపోయినై. సామాన్లు కింద పెట్టి, భార్యని, పిల్లల్ని అమాంతంగా కౌగిలించుకున్నాడు. అతని కళ్ళల్లోనే కాదు.... కుటుంబ సభ్యులందరి కళ్ళల్లోనూ ఆనంద భాష్పాలు గిర్రున తిరిగినయ్. అందరూ ఆటోలో ఇల్లు చేరుకున్నారు.

ఇంట్లో సోఫాలో కూచుని, యిల్లంతా ఓసారి కలయ జూశాడు, వేణుగోపాల్. అంతా కొత్తలా తోచింది. ఇంట్లో యెన్నో మార్పులు వచ్చినట్టనిపించింది.

అప్పుడే వంట గదిలోంచి కాఫీ తీసుకుని వచ్చింది వసంత.

"కాఫీ తీసుకోండి" కాఫీ కప్పు భర్తకి అందిస్తూ అంది, వసంత.

"ఎన్నాళ్ళకి నీ చేతి కాఫీ తాగుతున్నాను వసంతా" అంటూ కాఫీని సిప్ చేస్తూ, "కాఫీ అద్భుతంగా వుంది వసంతా" మెచ్చుకున్నాడు వేణుగోపాల్.

వసంత, ముసిముసి నవ్వుకుంది. భర్తకేసి తదేకంగా చూస్తోంది. ఆయన బాగా నీరసించి పోయినట్టనిపించింది.

"ఎంతగా చిక్కిపోయారండి?" అంది.

వేణుగోపాల్‌కి, గతం గుర్తుకొచ్చింది. బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"నిజం చెప్పాలంటే ఎలాగో అదృష్టవంతుణ్ణి వసంతా. ఎన్ని యిక్కట్లు అనుభవించినా, ఎలాగో ఓలా యిల్లు చేరుకున్నాను. కొంద రైతే అక్కడి వాతావరణాన్ని తట్టుకోలేక, చేతిలో డబ్బులేక, తినడానికి తిండి లేక, నానా యాతనలూ అనుభవించిన వాళ్ళున్నారు. అక్కణ్ణించి బైటపడేవరకూ, ప్రతి ఒక్కడి ప్రాణమూ, గుప్పిట్లో వుందంటే నమ్మ. ఎంతో ప్రశాంతంగా వుండే ఆ దేశంలో యుద్ధ మేఘాలు కమ్ముకోడం, మన దురదృష్టమే అనుకో. డబ్బంతా అక్కడి బ్యాంకులోనే వుండి పోయింది. చేతిలో వున్న డబ్బుతోనే బయల్దేరాను. ఇన్నేళ్ళ నా కష్టం, వృధా అయ్యింది వసంతా" ఆవేదనతో చెప్పుకుపోతున్న వేణుగోపాల్ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగినై.

భర్త ఆవేదన చూసి, తట్టుకోలేకపోయింది వసంత. ఆమె గుండె ల్లోంచి దుఃఖం పొంగింది. కళ్ళు వర్షించినయ్.

"పోనీ లెండి. మీరు మరేం బాధపడకండి. వెధవ డబ్బు....పోతే పోయింది. మనకి ప్రాప్తం లేదనుకుంటాం. మీరు క్షేమంగా తిరిగొచ్చారు. అంతే చాలునండి. జీవితానికి డబ్బే ప్రధానం కాదు. ఆ దేశం వెళ్ళొద్దండి అని నెత్తీ నోరు బాదుకుని అప్పట్లో చెప్పాను. మీరు వినలేదు. జరగాల్సిం దేదో జరిగిపోయింది. మన అదృష్టం బావుండి, మీరొచ్చేశారు. అదే వది వేలు" అంటూ చీర చెంగుతో కళ్ళొత్తుకుంది వసంత.

"నేను పడిన కష్టాలు యిన్నీ అన్నీ కావు వసంతా! వాటిని తల్చు కుంటేనే వొళ్ళు జలదరిస్తుంది. ఒక్కో పూట రొట్టెముక్క కూడా దొరికేది కాదు. తాగడానికి నీరుండేది కాదు. అబ్బ! నరకమంటే అదేనేమో ననిపించింది" అనుభవాల్ని చెప్పుకుపోయేడు వేణుగోపాల్.

భర్త అనుభవించిన కష్టాల్ని వూహించుకుంటే, ఆమెకి యేడు పొచ్చింది.

"ఆ అనుభవాల్ని యింక గుర్తు చేసుకోకండి! ఏం చేస్తాం? ఆ కష్టాల్ని అనుభవించాలని మీ నొసట రాసి వుంది గాబట్టి అనుభవించక తప్పలేదు మీకు. అవన్నీ చేదు అనుభవాలుగా భావించి, మర్చిపోండి" రుద్ద స్వరంతో అంది వసంత. భర్తని వూరడిస్తున్నట్టుగా.

వేణుగోపాల్, భారంగా ఓ నిశ్వాసం వదిలారు.

"అంతేలే వసంతా! అవన్నీ మర్చిపోడానికే ప్రయత్నిస్తున్నాను. అయితే, ఒక్కటే బాధ!"

"ఏవిటండీ?"

"ఇన్నాళ్ళూ శ్రమించి సంపాదించిన డబ్బు, తెచ్చుకోలేకపోయానే అని!"

"పోనీ లెండి. ఆ విషయాన్నే మర్చిపోండి. ఇంతవరకూ మీరు గడించి తెచ్చింది చాలదటండీ! ప్రాప్తమంటూ వుంటే అక్కడ వుండి పోయిన డబ్బూ వస్తుంది."

"అదీ నిజమే! ఇంక, ఆ తలంపే పెట్టుకోను. ఇక్కడో ఫాన్సీ స్టోర్సు పెట్టుకుంటాను. పోతే బ్యాంకులో వున్న డిపాజిట్స్‌కి వడ్డీరూపేణా

బాగానే వస్తుంది. ఈ ఆదాయం చాలు వసంతా, మనం సుఖంగా జీవించ డానికి. మళ్ళీ ఆ దేశంగాని, మరో దేశంగాని వెళ్ళే ప్రసక్తే వుండదు. ఇప్పటి యీ చేదు అనుభవం చాలు" వైరాగ్య ధోరణితో అన్నాడు వేణు గోపాల్.

వసంత మొహంలో, సంతోష ఛాయలు తారాడినయ్. భర్తలో సంతోషపు ఛాయలు తారాడినయ్. భర్తలో యిన్నాళ్ళకి 'తృప్తి' భావన చోటు చేసుకున్నందుకు, వసంత యెంతో ఆనందించింది.

"హమ్మయ్య! ఇన్నాళ్ళకి మీలో ఆ 'తృప్తి' చూశానండీ. నాకెంతో ఆనందంగా వుంది. జీవితంలో మనిషికి కావల్సింది, వున్నదాంతో తృప్తి జెందడమే! అప్పుడే జీవితం, సుఖమయమవుతుంది" అంది వసంత.

"జానసుకో...." అని మాత్రమే అనగలిగాడు వేణుగోపాల్.

"సరే, లేచి స్నానం చేసి రండి .... భోంచేద్దురుగాని...." అంటూ లేచి లోపలికి నడిచింది వసంత.

వేణుగోపాల్ సూట్‌కేస్ పట్టుకుని లోపలికివెళ్తుంటే పెద్దకొడుకూ బ్యాగ్ పట్టుకొని, తండ్రిని అనుసరించాడు.

* * *

మనసులోని కోరికలకు కళ్ళెం వెయ్యడం, అందరికీ సాధ్యంకాదు. అలా అదుపులో వుంచుకోడానికి యెంతో నిగ్రహం అవసరం.

వేణుగోపాల్ చిన్న ఫ్యాన్సీ స్టోర్సు పెట్టుకుని, యేదో వ్యాపారం చేస్తున్నాడు గాని, అతనికి సంతృప్తిగా లేదు. జీవితంలో యింకా యేదో వెలితి వున్నట్టే ఫీలవుతున్నాడు. ఇంకా యే విధంగా ధనార్జన చెయ్యాలా అన్న తలంపే, అతనిలో రోజురోజుకీ విశ్వరూపం దాలుస్తోంది.

సరిగ్గా అదే సమయంలో, వేణుగోపాల్ మొదట పని చేసిన దేశంలో యుద్ధం చల్లారింది. మామూలు పరిస్థితులు నెలకొన్నాయి. ఆ దేశంలో మళ్ళీ సాంకేతిక నిపుణులు, అవసరమయ్యారు. ముఖ్యంగా భారతదేశం నుంచే సాంకేతిక నిపుణులు కావాలని పత్రికల్లో ప్రకటనలు చేశారు. ఆ ప్రకటన వేణుగోపాల్ చూశాడు. అతనిలోని కోరికలకు రెక్కలొచ్చినయ్. మళ్ళీ ఆ దేశం వెళ్ళి, పుష్కలంగా డబ్బు గడించా

లన్న ఆశ, ఆసక్తి అతనిలో విజృంభించినయ్. అక్కడ బ్యాంకులోవున్న డబ్బు కూడా తెచ్చుకోవచ్చు ననుకున్నాడు. తన కోరికని భార్యతో చెప్పాడు.

వసంత నిర్ఘాంతపోయింది. చప్పున ఆమె నోట మాట రాలేదు. యుద్ధం చెలరేగిన నేపథ్యంలో, యెన్నో వైరాగ్య భావనలతో యిల్లు చేరుకుని, యింకే దేశమూ వెళ్ళనని వైరాగ్య భావనతో ఒక నిర్ణయానికి వచ్చిన భర్త మళ్ళీ అదే దేశం వెళ్ళాలని యెందుకు ఆసక్తి కనబరుస్తున్నాడో, ఆమెకి అర్థం కాలేదు.

"ఇదేవిటండీ! మళ్ళీ యిలా మారారు? ఆదేశంలో యుద్ధం చెలరేగిన తర్వాత, అక్కణ్ణించి మనదేశం రావడానికి మీరు యెన్ని యిక్కట్లు పడ్డారో మర్చిపోయారా? మీ చేదు అనుభవాల్ని తల్చుకుని మీరా రోజు యెలా కంట తడి పెట్టుకున్నారో, గుర్తు లేదా? ఇంకెప్పుడూ యేదేశమూ వెళ్ళనని నిర్ణయం తీసుకున్నారే! మరి యిప్పుడీ ప్రయత్నాలేవిటండీ? ఆ రోజు మీలో కలిగిన వైరాగ్య భావాలకీ, యిప్పుడు మీ ప్రయత్నాలకీ, యెక్కడైనా పొంతన వుందాండీ?" నిలదీసింది వసంత.

వేణుగోపాల్, ఫకాల్న నవ్వేశాడు. "మంచిదానివే వసంతా! నీకు, ప్రపంచ పరిజ్ఞానం చాలా తక్కువనుకుంటాను. నీ పరిధిలోనే నువ్వు ఆలోచిస్తున్నావు గాని, విస్తృత పరిధిలో ఆలోచించడం లేదు. అప్పట్లో నేననుభవించిన కష్టాల నేపథ్యంలో, నిస్పృహతో అప్పటికి యేదో అనేసి వుంటాను. అంత మాత్రాన, అదో లక్ష్మణ రేఖగా తీసుకుంటే యెట్లా చెప్పు? ఈనాడు మనకి .... కాదు .... యెవరికయినా కావల్సింది డబ్బు. డబ్బు లేకపోతే ఏ వ్యక్తికీ విలువ లేని రోజులివి. మనిషికి చదువు, తెలివి తేటలూ వుండనీ లేకపోనీ .... డబ్బుంటే చాలు. అదే సకల గౌరవాలూ సమకూరుస్తుంది. అందుకే, డబ్బు సంపాదించడంలో యెన్ని యిక్కట్లు అనుభవించినా ఫరవాలేదు. ఓ లెక్కలోది కాదు. ఓ మాట చెప్పనా!" ఆగాడు వేణుగోపాల్.

"చెప్పండి —"

"శవ దహనానికి అందరితోపాటు స్మశానానికి వెళ్ళినప్పుడు, జీవిత

మీమ్మీద ఓ విధమైన విరక్తి పుడుతుంది. ఔనా? దాన్నే స్మశాన వైరాగ్యం అంటారు. క్షణికమైన ఆ వైరాగ్యంతో, జీవించడం మానేస్తున్నామా? లేదే! అటువంటిదే నా వైరాగ్యం కూడాను! నా డబ్బు కూడా అక్కడ బ్యాంకులో వుంది. దాన్ని రాబట్టుకుందుకయినా వెళ్ళాలి కదా?"

"కేవలం దాని కోసమే వెళ్ళనవసరం లేదండీ! మన ప్రభుత్వం ద్వారా ప్రయత్నించి రప్పించుకోవచ్చు. అక్కడ మళ్ళీ యే యుద్ధమో ప్రకటించారనుకోండి. అప్పుడు మీ గురించి మేమెంతగా తల్లడిల్లిపోతామో ఆలోచించారా?" నీరసంగా అంది వసంత.

భార్య ధోరణి, వేణుగోపాల్‌కి నచ్చలేదు. "ఆదిలోనే హంసపాదు పెట్టి, నా పుత్సాహం మీద నీళ్ళు జల్లకు వసంతా! ఇదంతా యెవరికోసం చేస్తున్నానంటావు? నీ కోసం, పిల్లల కోసమే కదా?" అన్నాడు వేణు గోపాల్.

వసంత ఓ నిట్టూర్పు వదిలింది. "కాదని యెవరన్నారండీ! ఇంత వరకూ మీరు మా కోసం ఆర్జించింది చాలదూ? చాలండీ. మాకు యింకేమీ వొద్దని మేమే చెబుతున్నాం కదండీ. వున్న దాంతోనే తృప్తి పొందుదామండీ? మీ ప్రయత్నాన్ని విరమించుకోండి. ప్లీజ్...." అర్థించింది వసంత.

ఆమె మాటల్లో ఆమె మానసిక వ్యధ అవగతమౌతోంది, కాని, వేణుగోపాల్ చలించలేదు.

"వసంతా, నీ మాటల్తో నన్ను నిరుత్సాహపర్చకు. ఆ దేశంలో యింక యేయుద్ధమూ సంభవించదు. ప్రశాంత వాతావరణం నెలకొన్నది. అక్కడో రెండేళ్ళుంటే చాలు....పుష్కలంగా డబ్బు ఆర్జించి రావొచ్చును. మనందరం హాయిగా, చీకూ, చింతాలేకుండా జీవించవచ్చు. కోరివరిస్తున్న యీ అదృష్టాన్ని కాదనకూడదు వసంతా! నువ్వేం అడ్డుచెప్పకు" సీరియస్ గానే అన్నాడు.

భర్త నైజం బాగా తెలిసిన వ్యక్తి గనక, ఆయనింక మనసు మార్చుకునే స్థితిలో లేదనుకుంది వసంత. డబ్బు సంపాదించాలన్న

'యావ' ఎంత బలమైనదో, ఆమెకి తెలుసు. మనిషిలో ఆ 'యావ' ఒకసారి మొలకెత్తితే, అది ఆ మనిషి జీవితాంతం వుంటుందనుకుంది. తన ప్రయత్నం యింక వృధా అనుకుంది. భర్త మొండిపట్టుకి, లోలోన బాధపడింది. అంతకంటే ఆమె చేయగలిగిందేమీ లేదనుకుని నిస్పృహతో నిట్టూర్చింది.

"మీ యిష్టమండీ" ముక్తసరిగా అనేసి, వంట గదికేసి దారి తీసింది, చెమ్మగిల్లిన కళ్ళు ఒత్తుకుంటూ.

వేణుగోపాల్, భార్య వ్యథనీ, ఆందోళననీ పట్టించుకోలేదు. అతని మనోదృష్టికి కనిపిస్తున్నది, ఆ దేశంలో తాను సంపాదించబోయే డబ్బు!

* పల్లకి సచిత్ర వారపత్రిక, 7-4-1993 *